COMMUNIST PARTY OF INDIA (MARXIST)
ANDHRA PRADESH COMMITTEE
H.No. 27-28-12, CPI(M) State Committee Office
Yamalavari Street, Governor Pet, Vijayawada -2
☎ 0866 - 2577202, Fax: 0866 - 2577203
E-mail: cpimap@gmail.com

ప్రచురణార్థం/ ప్రసారార్థం :

విజయవాడ,
తేది : 5 ఫిబ్రవరి, 2019.

# అంకెల గారడీ బడ్జెట్

నేడు శాసనసభలో రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ ఓట్లకోసం అంకెల గారడీలకే పరిమితమైంది. వాస్తవ విరుద్ధంగా కేటాయింపులు చేసి ప్రజలను మోసగించే విధంగా ఈ బడ్జెట్ రూపొందించారు.

2,26,177.53 కోట్ల భారీ బడ్జెట్‌లో ఎన్నికలను దృష్టిలో పెట్టుకొని అనేక తాయిలాలు ప్రకటించారు. అన్నదాత సుఖీభవతో సహా 6 కొత్త సంక్షేమ పథకాలు ప్రకటించారు. పాత సంక్షేమ పథకాలకు నిధులు పెంచుతున్నట్లు చూపించారు. కానీ ఈ ప్రభుత్వం గతేడాది బడ్జెట్‌లో సంక్షేమ కార్యక్రమాలకు చూపించిన నిధులను ఖర్చు చేయకుండా కోత విధించడం చూస్తే ఇది ప్రజలను మోసగించే బడ్జెట్ అని తేలుతుంది. ఉదాహరణకు 2018-19 బడ్జెట్‌లో బిసి వెల్ఫేర్ కోసం రూ.6,213.17 కోట్లు కేటాయించినా సవరించిన బడ్జెట్‌లో రూ.5,356.70 కోట్లకు కుదించారు. మిగతా సంక్షేమ పథకాలకు కూడా ఈ పద్ధతిలోనే కేటాయింపులు చూపినా ఖర్చులో మాత్రం కోతలు పెట్టారు. 1. బిసి సంక్షేమం, 2. ఆహార పౌరసరఫరాలు, 3. కార్మికుల ఉపాధి, 4. మైనారిటీల సంక్షేమం, 5. సాంఘిక సంక్షేమం, 6. మహిళా శిషు సంక్షేమం, 7. యువజన క్రీడలు, 8. స్కిల్ డెవలప్‌మెంట్ వంటి పథకాలకు గతేడాది బడ్జెట్‌లో మొత్తం రూ.23,613 కోట్లు కేటాయించగా సవరించిన బడ్జెట్‌లో రూ.18,258 కోట్లకు కుదించారు. దాదాపు రూ.5,355 కోట్లు కోత పెట్టారు. విద్యారంగానికి కేటాయించిందానిలో రూ.3,118 కోట్లు సవరించిన బడ్జెట్‌లో తగ్గించారు. ఇప్పుడు మళ్ళీ కొత్త బడ్జెట్‌లో సంక్షేమ రంగానికి పెద్ద ఎత్తున కేటాయింపులు చేస్తున్నట్లు చూపించారు.

మిగతా రంగాల కేటాయింపులు కూడా అదే విధంగా వున్నాయి. ఉదాహరణకు నిరుద్యోగ భృతిని నెలకు రూ.1,000 నుండి రూ.2,000లకు పెంచినా బడ్జెట్‌లో మాత్రం గతేడాది రూ.1,000కోట్లు కేటాయిస్తే దాన్ని ఈ ఏడాది రూ.1,200 కోట్లకు మాత్రమే పెంచారు. పెంచిన 20% కేటాయింపులతో 100% భృతి ఎలా పెంచుతారో వారికే అర్థం కావాలి. పసుపు - కుంకుమ క్రింద 93 లక్షల మంది మహిళలకు రూ.10 వేలు చొప్పున ఇవ్వడానికి సుమారు రూ.9,300 కోట్లు అవసరం కాగా కేవలం రూ.4,000 కోట్లు మాత్రమే కేటాయించడమంటే మహిళలకిచ్చిన చెక్కులు సగం చెల్లవన్నమాట. ఉపాధిహామీ పథకానికి ఈ ఏడాది రూ.1,000 కోట్లు కేటాయించారు. కానీ రాష్ట్ర ప్రభుత్వం ఉపాధి కార్మికులకు ఉన్న బకాయి రూ.1,872 కోట్లు. అంటే ప్రభుత్వం చేసిన కేటాయింపు ఏ మూలకు సరిపోదన్నమాట.

ఈరోజు రాష్ట్రంలో సగానికి పైగా జిల్లాలు తీవ్రమైన కరువును ఎదుర్కొంటుంటే ఆ సమస్యను పరిష్కరించడానికి ఈ బడ్జెట్‌లో ఎటువంటి పరిష్కారం చూపించలేదు. ఆత్మహత్యలకు పాల్పడుతున్న రైతాంగాన్ని ఆదుకోవాలంటే వారి పంటలకు గిట్టుబాటు ధరలు రుణభారం నుండి ఇముక్తికి బడ్జెట్‌లో ప్రతిపాదనలు లేవు. అలాగే చాలీ చాలని వేతనాలతో కునారిల్లిపోతున్న అసంఘటిత రంగ కార్మికుల కోసం బడ్జెట్‌లో ఎటువంటి కేటాయింపులు లేవు. ఆర్టీసి సంస్థను కాపాడడానికిగానీ, ఉద్యోగుల మధ్యంతర భృతికి కూడా ఇందులో కేటాయింపులు చేయలేదు. అంటే ఉద్యోగులకు మొండిచెయ్యి చూపినట్లే.

మొత్తం ప్రభుత్వ బడ్జెట్ లోతుగా పరిశీలించినప్పుడు రాష్ట్ర ప్రభుత్వం తన వైఫల్యాలను కప్పిపుచ్చుకోవడానికి సంక్షేమ పథకాల పేరుతో ప్రజలను మోసగించి ఎన్నికల్లో లబ్ధిపొందాలని చూస్తోంది. రాష్ట్ర ప్రభుత్వ అంకెల గారడీని ప్రజలు విశ్వసించరు.

(పెనుమల్లి మధు)
రాష్ట్ర కార్యదర్శి